www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

బుధవారం | 01 | జనవరి | 2025 పేజీలు 6

## ప్రజాహితమే జర్నలిజం లక్ష్యం కావాలి : పువ్వాడ



-'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరణ

2 లో

● మరో ఏడాది గడిచిపోయింది

# సంబురం కాదు.. లక్ష్యం ముఖ్యం





**ప్రజాపక్షం/ఖమ్మం :** నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్నా మన్న సంబురం కంటే జీవితంలో ఓ ఏడాది గడిచిపోయిందన్న ఆలోచన ముఖ్యం. 2024 కాస్త తొందరగానే గడిచిపోయిందన్న భావనతో కొందరు ఉన్నారు. నూతన సంవత్సర సంబురాలతో పాటు లక్ష్యం నిర్ణయించుకోవాలి. విందులు, చిందులతో కాలం గడిపే యువత లక్ష్యం దిశగా పయనించలేక యువశక్తిని నిర్వీర్యం చేసుకుంటున్నారు. కొత్త సంబురాల పేరుతో విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ, మద్యం సేవిస్తూ

మిగతా 2లో..

## ఘనంగా ప్రారంభమైన ముక్కోటి అధ్యయనోత్సవాలు



- అంతరాలయంలో శాస్త్రోక్త పూజలు
- తొలిరోజు మత్స్య అవతారంలో దర్శనమిచ్చిన స్వామివారు
- చూసి తరించిన భక్తులు
- పరిసరాలు శోభాయమానం

**ప్రజాపక్షం/భద్రాచలం :** ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా అధ్యయనోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజాధికార్యక్రమాలను శాస్త్రీయపద్ధతిలో నిర్వహించారు. ఉత్సవమూర్తులను అభిషేకం నిర్వహించి ఉత్సవాల వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంతరాలయంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి నూతన వస్త్రాలు ధరింపజేశారు. ప్రత్యేక పల్లకీలో మిథిలా స్టేడియం వరకు ఉత్సవమూర్తులను మేళతాళాల నడుమ సిద్ధం చేసిన ప్రత్యేక వేధిక వద్దకు తోడుకొచ్చారు. దారిపొడవునా జై శ్రీరాం అంటూ పెద్దపెట్టున నినాదాలు, భజన కోలాట నృత్యాలు చేశారు. స్వామివారి పల్లకీని తాకేందుకు భక్తులు పెద్ద ఎత్తున

మిగతా 2లో..

## ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య



- కళాశాల ప్రిన్సిపాల్, హౌజ్ మాస్టర్ సస్పెండ్
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాలు, లింగాల కమల్‌రాజు డిమాండ్

**ప్రజాపక్షం/మధిర :** మండల పరిధిలోని కృష్ణాపురం గురుకుల కళాశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ముదిగొండకు చెందిన మాడుగుల సాయివర్ధన్ (17) అనే విద్యార్థి కృష్ణాపురంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపిసి ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల క్రిస్మస్ సెలవుల సందర్భంగా నిముదిగొండకు సాయివర్ధన్ వెళ్లి సోమవారం కళాశాలకు వచ్చాడు. అప్పటి వరకు తోటి విద్యార్థులతో ఉన్న సాయివర్ధన్ అర్ధరాత్రి సమయంలో హాస్టల్‌లోని పై అంతస్థు ఆవరణంలో ఎవరూలేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తెల్లవారుజామున ఫ్యాన్‌కు ఉరివేసుకుని విఘతజీవిగా ఉన్న సాయివర్ధన్ చూసిన



మిగతా 2లో..

## ఖమ్మంలో భారీ అగ్నిప్రమాదం



-సుమారు రూ. కోటిన్నర ఆస్తినష్టం

-రంగంలోకి నాలుగు ఫైరింజన్‌లు

-ఎనిమిది గంటలపాటు శ్రమించి మంటలు అదుపుచేసిన ఫైర్ సిబ్బంది

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లా కేంద్రంలోని ముస్తాఫా నగర్‌లో మంగళవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముస్తాఫానగర్‌కు చెందిన జాలాది శ్రీనివాసరావు స్థానికంగా శ్రీరాజరాజేశ్వరి పేరుతో టెంటుహౌస్ నిర్వహిస్తున్నాడు. విశాలమైన గదులతో పెద్ద ఎత్తున సామాగ్రితో వ్యాపారం ప్రారంభించాడు. స్థానికంగానే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు శుభకార్యాలు తదితర అవసరాలకు సామాగ్రిని కిరాయికి ఇస్తూ ఆదాయం సమకూర్చుకుంటున్నాడు. పేరు ఉన్న వ్యాపారి కావడంతో చిరువ్యాపారులు సైతం ఇతని వద్ద నుంచి అవసరాలకు సామాగ్రి తీసుకువెళ్తుంటారు. ఇదిలా ఉండగా రోజువారిగా శ్రీనివాసరావు సోమవారం రాత్రి షాపు మూసివేసి సమిపంలో ఉన్న తన ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి మూడుగంటల సమయంలో దుకాణంలో షాక్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పొగలు బయటికి

మిగతా 2లో..

# సంబురం కాదు.. లక్ష్యం ముఖ్యం



(మొదటిపేజీ తరువాయి)
ఇబ్బందికర వాతావరణం సృష్టిస్తున్నారు. గమ్యం లేని ప్రయాణం ఈ పరిస్థితికి కారణమవుతుంది. జీవిత కాలంలో ఏమి సాధించకుండానే ఒక ఏడాది గడిచిపోయిందన్న దృష్టితో ఆలోచించి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుంటే కనీసం నూతన సంవత్సరమైనా కొంత మేలుకొల్పుగా ఉంటుంది. ఇక కొత్త సంవత్సరం పేరిట జరుగుతున్న హంగు ఆర్భాటం అంతా ఇంత కాదు. సంబురాలు చేసుకుంటే తప్పేమి కాదుకాని ఆ పేరుతో జరుగుతున్న విచ్చలవిడితనం ప్రాణాల మీదకి తీసుకు వస్తుంది. అతిగా మద్యం సేవించి వేగంగా వాహనాలను నడుపుతూ ప్రాణాలను కోల్పోతున్నారు. అదే మద్యం మత్తులో కొందరు ఘర్షణలకు దిగి ప్రత్యర్థుల చేతుల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల కాలంలో వేడుకల తీరు మారిపోతుంది. విందు అతి ఖరీదవుతుంది. సంపన్న వర్గాలను చూసి మధ్య తరగతి కూడా పోటీపడుతుంది. యువత ఈ స్థితికి రావడానికి కొంత పాలక వర్గాలు కూడా కారణమేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉచితాలు, ఓట్లు గద్దె నెక్కిన తర్వాత దానిని కాపాడుకునే యత్నం వీటితోనే పాలకులు సరిపెట్టుకుంటున్నారు తప్ప నూటికి 50 శాతం యువకులు ఉన్న దేశంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువశక్తి నిర్వీర్యమవుతుంది. తల్లిదండ్రులకు భారంగా మారిన కొందరు గాడి తప్పి మత్తుకు బానిసలవుతున్నారు. ఈ పరిస్థితి రోజు రోజు పెరుగుతున్నా పాలక వర్గాలు ఎందుకో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పబ్బం గడుపుకునే పని చేస్తున్నాయి తప్ప మరొకటి లేదు. లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని రానున్న నూతన సంవత్సరం సుఖ సంతోషాల మధ్య గడపాలని కోరుకుందాం.

# ఘనంగా ప్రారంభమైన ముక్కోటి అధ్యయనోత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)
పోటిపడ్డారు. అనంతరం వేధికపై స్వామివారిని ఆశీనులను చేసి పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు స్వామివారు భక్తులకు మత్స్యావతారంలో దర్శనమిచ్చారు. ఈ అవతారంలో ఉన్న స్వామిని దర్శించుకుంటే సకల బాధలు తొలగిపోతాయని భక్తుల అపారనమ్మకం. వేదిక వద్ద స్వామివారి మత్స్యరూపాన్ని కనులారా చూసిన భక్తులు జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు. దీంతో మిథిలా స్టేడియం ప్రాంగణం భక్తిభావంతో తొనికిసలాడింది. అనంతరం స్వామివారి అవతార రూపంపై అర్చకులు భక్తులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

**పరిసరాలు శోభాయమానం...**
ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకుని రామాలయ పరిసరాలు శోభాయమానంగా మారాయి. పట్టణంలో ఎటు చూసిన విద్యుత్ దీప కాంతులు కనిపిస్తున్నారు. రామాలయం గాలిగోపురంతో పాటు చుట్టు ప్రకారాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలకంరించారు. స్వామివారి ప్రతిమలు సైతం దర్శనిమిచ్చేలా రంగురంగుల దీపాలు



వెలుతురులు విరజిమ్ముతున్నాయి. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. గోదావరి తీరంలో సైతం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే విధంగా ఏర్పాట్లు చేశారు. భక్తులు లోతుకు వెళ్లి ప్రమాదంలో పడకుండా బారికేట్లతో పాటు ప్రమాదసూచిక బోర్డులు అమర్చారు. నదీ రంలో అపరిశుభ్ర వాతావరణం లేకుండా గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు ముమ్మరం చేస్తున్నారు.

# ఖమ్మంలో భారీ అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)
రావడంతో గమనించిన చుట్టు పక్కల వారు సదరు షాపు యజమానికి సమాచారం అందించారు. అతడు వచ్చి చూడగా లోపల సామాగ్రికి నిప్పు అంటుకుని మంటలు ఎగిసిపడుతుండటంతో స్థానిక ఫైర్ స్టేషన్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. జిల్లా ఫైర్ అధికారి అజయ్‌కుమార్ సిబ్బంది, అగ్నిమాపక వాహనంతో అక్కడికి చేరుకుని నీరు చల్లూతూ మంటలు అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడం, భారీగా మంటలు ఎగిసిపడుతుండటంతో కూసుమంచి, నేలకొండపల్లి, వైరా ఫైర్ స్టేషన్‌లకు ఫోన్‌లో సమాచారం తెలియజేశారు. ఆయా సిబ్బంది ఫైర్ ఇంజన్‌లతో ఖమ్మంలోని ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. తెల్లవారుజామున మూడు గంటలకు మంటలకు చలార్చటం ప్రారంభించిన సిబ్బందికి ఉదయం 11 గంటల మంటలను పూర్తిగా చల్లార్చారు. ఈప్రమాదంలో భారీ టెంట్లు, షెడ్‌వాల్స్, కుర్చిలు, వంట సామాగ్రి తదితరాలు పూర్తిగా కాలి



బుడిదైయ్యాయి. విషయం తెలుసుకున్న వన్ టౌన్ సిఐ ఉదయ్‌కుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకుని బాధిత వ్యాపారితో మాట్లాడి వివరాలు సేకరించారు. మున్సిపాల్ సిబ్బంది సైతం అక్కడికి చేరుకుని దగ్ధమైన సామాగ్రిని ట్రాక్టర్ల సాయంతో తొలగించారు. ఫైర్ సిబ్బందితో పాటు పోలీసు, మునిసపాల్ సానిటరీ సిబ్బంది సుమారు ఎనిమిది గంటలకు పైగా శ్రమించారు. మంటలు దాటికి పరిసర నివాసాలు గొడలు బీడలు వారాయి. దట్టమైన పోగతో ఆప్రాంతమంతా అంధకారంగా మారింది. రెవిన్యూ సిబ్బంది అక్కడికి చేరుకుని పంచనామా చేశారు. రాత్రి సమయం కావడంతో ఈఅగ్ని ప్రమాదంలో ప్రాణ నష్టం సంభవించలేదు. సామాగ్రి పూర్తిగా కాలిపోవడంతో సుమారు కోటి రూపాయల వరకూ ఆస్థినష్టం జరిగిందని భాదితుడు బోరున విలపిస్తూ వాపోతుండగా ఫైర్‌సిబ్బంది, పోలీసుల సుమారు రూ. కోటిన్నర ఆస్తినష్టం జరిగిఉండవచ్చని అంచనా వేస్తున్నారు. పోలీసులు ఇది ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఇతర కారాణాలు ఉన్నాయా అనే కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# 'ప్రజాపక్షం' కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజాపక్షం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. 2025కు స్వాగతం పలుకుతూ కార్యాలయంలో ప్రజాపక్షం ఎడిషన్ ఇంచార్జి ఏనుగు వెంకటేశ్వరరావు కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది అనుభవాలను స్మరించుకుంటూ నూతన సంవత్సరంలో కొత్త ఆలోచనాలకు నాంది పలకాలని కోరారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠకులకు, ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాప్ రిపోర్టర్ కొర్లపాటి ప్రసాదరావు,



రిపోర్టర్ చిట్టూరి నరేష్, డెస్క్ ఇన్‌చార్జ్ పింగళి రాంబాబు, ఆపరేటర్ గడ్డం రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాహితమే జర్నలిజం లక్ష్యం కావాలి : పువ్వాడ



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజాహితమే జర్నలిజం లక్ష్యంగా పనిచేయాలని మాజీ శాసన సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు కోరారు. మీడియా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలన్నారు. మంగళవారం ప్రజాపక్షం క్యాలెండర్ 2025ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ మీడియా ఎప్పుడు ప్రజల పక్షాన నిలబడాలని ప్రజా అవసరాలను గుర్తించి పాలకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గానికి కృషి చేయాలన్నారు. ప్రజాపక్షం దినపత్రిక ప్రగతిశీల భావజాలంతో ప్రజల గొంతుకై పనిచేయడం అభినందనీయమన్నారు. పత్రికను జన బాహుళ్యంలోకి తీసుకెళ్లాలని కోరిన పువ్వాడ మరిన్ని ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రజాపక్షం ఎడిషన్ ఇంచార్జి ఏనుగు వెంకటేశ్వరరావు, ప్రకటనల విభాగం ఇంచార్జి టికె ప్రసన్నన్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, సిపిఎం నాయకులు వై. విక్రం, మాదినేని రమేష్, మాస్‌లైన్ నాయకులు ఆవుల అశోక్, సిపిఐ నాయకులు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వర్లు, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, రావి శివరామకృష్ణ, ప్రజాపక్షం రిపోర్టర్లు కె. ప్రసాదరావు, పులి కృష్ణార్జునరావు, యాసా నర్సింహారావు, సిపిఐ ప్రజా సంఘాల బాధ్యులు తాటి నిర్మల, ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.

# ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)
అక్కడి సిబ్బంది వెంటనే స్థానిక పోలీసులుకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న వైరా ఎసిపి రెహమాన్, ఆర్‌డిఓ జి.నర్సింహారావు సంఘటనాస్థలానికి చేసుకుని విద్యార్థి ఆత్మ



హత్యకు గల కారణాలను అక్కడి విద్యార్థులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యార్థి ఆత్మహత్య సంఘటనను తెలుసుకున్న మాజీ జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు మృతదేహాన్ని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రేమ వ్యవహర కారణంగానే సాయివర్ధన్ ఆత్మహత్య కారణమని, సాయివర్ధన్ ఆత్మహత్య చేసుకున్న ముందు ప్రేమ కవితరాసి మృతి చెందినట్లు ఆధారాలు లభించాయని పోలీసులు తెలిపారు. విద్యార్థి ఆత్మహత్య ఘటనతో అక్కడికి చేరుకున్న తల్లి దండ్రులు కళాశాల ఎదుట విద్యార్థి సంఘాలతో ఆందోళన నిర్వహించారు. కళాశాల సిబ్బంది నిర్లక్ష్యమే సాయివర్ధన్ ఆత్మహత్యకు కారణమని ఆరోపించారు. విద్యార్థి సంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ, సురేష్, సుధాకర్, మస్తాన్, మడుపల్లి లక్ష్మ ణ్ మాట్లాడుతూ గురుకులాలు విద్యార్థుల ఆత్మహత్యలకు నిలయాలాగా మారుతున్న ప్రభుత్వం గురుకుల సంక్షేమ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. సాయివర్ధన్ మృతి చెందటం అనేక అనుమానాలకు తావిస్తుందని, గురకులాలను హాస్టల్స్‌ను ప్రక్షాళన చేయాలని అన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే విద్యార్థి ఆత్మహత్య ఘటనలో కళాశాల పిన్సిపాల్ శ్రీనివాస్, హౌస్ మాస్టర్ మోషేను విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఆర్‌డిఓ నర్సింహారావు సస్పెండ్ చేశారు. కుటుంబంలో ఒకరి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, త్వరలోనే ఎక్స్‌గ్రేషియా కలెక్టర్ ప్రకటిస్తారని ఆర్‌డిఓ నర్సింహారావు ఇచ్చిన హామీ మేరకు విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ రాంబాబు, సిఐ మధు, రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తలారి 12వ వర్థంతి

**ప్రజాపక్షం/ మధిర :** నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అజరామరమైన పోరాటాలు సాగించి అమరులైన కమ్యూనిస్టులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటారని సిపిఐ మండల



కార్యదర్శి ఊట్ల కొండలరావు, జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దెందుకూరు గ్రామంలో అమరజీవి తలారి వెంకటేశ్వరరావు 12వ వర్థంతిని ఆయన స్మారక స్థూపం వద్ద జెండాను ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వతంత్ర పోరాటం నుండి పురుడు పోసుకున్న సిపిఐ పెత్తందారుల కంబంధ హస్తాల్లో నలుగుతూ పెట్టుబడిదారుల కుట్రలను బలవుతున్న నిర్భాగ్యుల వెంట ఎప్పుడు ఎర్రజెండా ఉంటుందని అన్నారు. కార్మిక, శ్రామిక హక్కుల సాధన కోసం నిరంతరం పనిచేస్తూ వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ చాలా మంది యోధుల్ని కోల్పోవడం దురదృష్టకరమన్నారు. తలారి వెంకటేశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో చావా మురళీ కృష్ణ, శిలువేరు శ్రీనివాసరావు, మంగళగిరి రామాంజనేయులు, తలారి రమేష్, అన్నవరపు సత్యనారాయణ, జల్లా బ్రహ్మం రంగు నాగకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సిబ్బంది సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. కళావతి బాయి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పి)తో డిఎంఅండ్‌హెచ్‌వో కళావతి బాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పి విధులు ఎంతో అమూల్యమైనవని ప్రతి గ్రామంలో వారి సేవలు అందిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో డ్రైడే ఫ్రైడే తప్పక పాటించాలన్నారు. ఉదయం సమయంలో ఓపి విధులు నిర్వహించి మధ్యాహ్నం ఫీల్డ్‌కు తప్పనిసరిగా వెళ్లాలని, ఫెషియల్ అటెండెన్స్ ఇన్‌టైంలో రెగ్యులర్‌గా ఉండాలన్నారు. డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో సైదులు మాట్లాడుతూ తల్లీ బిడ్డల క్షేమం కొరకు సిబ్బంది కృషి చేయాలన్నారు. గర్భిణీ అయిన దగ్గర నుంచి వైద్య సేవలను అందించాలని తెలిపారు. పుట్టిన బిడ్డలకు అన్ని రకాల ఇమ్యూనైజేషన్‌లు అందించాలని తెలిపారు. సాధారణ ప్రసవాలు అయ్యేవిధంగా ప్రోత్సహించా లన్నారు. పివోలు వైద్యులు రామారావు , చందు లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓపి స్లిప్పులను వినియోగించాలని తెలిపారు. 12 రకాల విధులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డెమో సాంబశివరెడ్డి, డిపివో దుర్గ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి పోటీలకు త్రివేణి విద్యార్థి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భూపాల్‌లో జరగనున్న జాతీయ స్థాయి నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ (ఎన్‌సిఎస్‌సి) పోటీలకు త్రివేణి పాఠశాల విద్యార్థి డార్విన్ బాలాజీ ఎంపికయ్యారు. హైదరాబాద్ బేగంపేటలో డిసెంబర్ నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎన్‌సిఎస్‌సి పోటీల్లో డార్విన్ బాలాజీ పాల్గొని ప్రథమ బహుమతి సాధించారు. బాలాజీ రూపొందించిన ప్రాజెక్టు సొల్యూషన్ టు ద కన్వర్జేషన్ ఆఫ్ బయో డైవర్సిటీ ఫ్రొం ద గ్రానైట్ ఎగ్జాస్టర్స్‌పై చేసిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి జనవరి మూడు నుంచి భూపాల్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభ ఆధారంగా ఉన్నత శిఖరాలను అధిరోహించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో కూడా నైపుణ్యత సాధించాలన్నారు. విద్యార్థుల విజయం వెనుక త్రివేణి పాఠశాల ఎల్లప్పుడు వెన్నంటే ఉంటుందన్నారు. విద్యార్థి ద్వారిన్ బాలాజీ, గైడ్ టీచర్ ఈవి సుబ్బారావులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సిఆర్‌వో మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జి చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వజ్ఞలో నూతన సంవత్సర వేడుకలు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో 2025 నూతన సంవత్సర వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, నీలిమ లు పాల్గొని నూతన సంవత్సర కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన ప్రతి సంవత్సరం అనేక కొత్త పాఠాలను నేర్పుతుందన్నారు. నూతన సంవత్సరంలో కొత్త లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. నూతన ఆహారపు అలవాట్లు క్రమశిక్షణ, సమయపాలన సద్గుణాలను అలవర్చుకోవాలన్నారు. సర్వ మానవాళికి, జీవకోటికి నూతన సంవత్సరం శుభాలు చేకూర్చాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలను బెల్లూన్లు, రంగవల్లులతో అలంకరించారు. విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రెజొనెన్స్‌లో నూతన సంవత్సర వేడుకలు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల రెజొనెన్స్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు ఆటపాటలతో కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. నూతన సంవత్సర సందర్భంగా డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణిలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో కొత్త కొత్త విషయాలు తెలుసుకోవడం , మంచి అలవాట్లు అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. గత సంవత్సర అనుభవాల స్ఫూర్తితో నూతన సంవత్సరంలో మరిన్ని విజయాలు సాధించాలన్నారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. 2024కు వీడ్కోలు పలుకుతూ 2025కు స్వాగతం చెబుతూ విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగుల సేవలో సంఘం పాత్ర ఉన్నతమైంది..




**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత జీవితం గడుపుతున్న పెన్షనర్ల సమస్యలను గుర్తించి వారికి సంఘం ద్వారా సేవలను అందించటం అభినందనీయమని సత్తుపల్లి సబ్ ట్రెజరర్ అధికారి సునీల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సంఘ కార్యాలయంలో సంఘం నూతన డైరీ, క్యాలండర్‌లను ఎస్‌టిఓ సునీల్ ముఖ్య అతిధిగా హాజరై సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ఆరోగ్య శిభిరాలను నిర్వహించడంతో పాటు సంఘ పరంగా అమూల్యమైన సేవలను అందించటం జరుగుతుందని , తమ శాఖపరమైన సహాయాన్ని సత్వరంగా విశ్రాంత ఉద్యోగులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రదాన కార్యదర్శులు కేశవరెడ్డి, భద్రుద్దీన్‌లతో పాటు ఎస్‌టీఓ కార్యాలయ నుండి రవిచంద్ర, కృష్ణయ్య, మాదవరెడ్డి, సాంబశివరావు, రామిశెట్టి సుబ్బారావు, ప్రకాషరావు, అద్దంకి వెంకటరత్నం, బాలు, సాంబశివరెడ్డి, కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఐఏఎల్ క్యాలెండర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఏఎల్) క్యాలెండర్‌ను మంగళవారం కోర్టు ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ గౌరవాధ్యక్షులు పోట్ల మాధవరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, ఐఏఎల్ నాయకులు అమర్‌చంద్, పట్టాభి, పలువురు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బిఐటిలో ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో 2025 నూతన సంవత్సర వేడుకలను మంగళవారం ఘనం గా నిర్వహించారు. నూతన సంవత్సర సందర్భంగా కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం మన జీవితంలో నూతన అనుభవాలు, ఆనందాలను తీసుకు వస్తుందని ఆయన తెలిపారు. గత అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుని నూతన సంవత్సరాన్ని ప్రణాళికాబద్ధంగా సరిదిద్దుకోవాలన్నారు. 2024 సంవత్సరం తమ కళాశాలకు న్యాక్ ఏప్లస్‌తో పాటు అటానమస్ హోదాను తెచ్చిపెట్టిందన్నారు. నూతన సంవత్సర సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డా॥ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జె. రవీంద్రబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్‌కిడ్జ్‌లో న్యూ ఇయర్ వేడుకలు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో 2025 నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. 2025 సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ వేడుకలను నిర్వహించారు. పాఠశాల ఆవరణమంతా రంగవల్లులతో తీర్చిదిద్దారు. బెలూన్లతో అందం గా అలంకరించారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 సంవత్సరానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని మ్యాథమెటికల్ లాజిక్ పరంగా 2025 సంవత్సరం ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆటపాటలు, నృత్యాలతో సందడి చేసి మిఠాయిలు పంచుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ ఉద్యోగులకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** పట్టణంఓని జలగం వెంగళరావు ఓపెన్ కాస్ట్‌లొ సుదీర్ఘకాలం సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహించి ,పదవీ విరమణ పొందిన ఉద్యోగులు పిట్ట నారాయణ, సత్యనారాయణలను ఐఎన్‌టీయూసి యూనియన్ ఆద్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఫిట్ సెక్రెటరీ రామారావు అద్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ ముఖ్య అతిధిగా హాజరై రామారావు, సత్యనారాయణలను శాలువాతో ఘనంగా సత్కరించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీయూసి సీనియర్ నాయకులు చెన్నకేశవరావు, బ్రాంచ్ నాయకులు సమ్మయ్య, ప్రసన్న, సురేష్, కనకయ్య, తిరుమలరావు, కిషన్‌రావు, చాంద్, మురళీ, రషీద్, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, కిరణ్, శ్రీనివాస్, రాము, రమేష్,రాజేందర్, నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయికి ఎంపికైన టాలెంట్ విద్యార్థిని



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** తెలంగాణ సాంఘీక శాస్త్ర ఫోరం సత్తుపల్లి మండల స్థాయిలో మంగళవారం నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్ట్‌లో పట్టణంలోని సిద్దారం రోడ్డులో గల టాలెంట్ స్కూల్ విద్యార్ధిని జలదాని తన్మాయ్ శ్రీజ తృతీయ బహుమతి సాధించి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్స్‌పాల్ పులి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. తృతీయ బహుమతి సాధించిన విద్యార్ధినికి మండల విద్యాశాఖాధికారి నక్కా రాజేశ్వరరావు, సత్తుపల్లి సోషల్ ఫోరం భాద్యులు చేతుల మీదుగా ప్రశంసా పత్రం, షీల్డును అందజేశారు. విద్యార్ధిని పాఠశాల అద్యాపక బృందం అభినందించింది.

## హామీలన్నీ ప్రభుత్వం అమలు చేస్తుంది..



ప్రజాపక్షం/జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని జూలూరుపాడు మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ప్రియాంక అన్నారు. సోమవారం పీక్లా తండా గ్రామంలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆమె పరిశీలించి మాట్లాడారు. 200 యూనిట్ల ఫ్రీ కరెంట్, ఫ్రీ బస్, రైతు రుణమాఫీ, గ్యాస్ సబ్సిడీ, వరికి 500 బోనస్ అమలు చేశారన్నారు. సంక్రాంతికి రైతు భరోసా అందిస్తారని చెప్పారు. ఈ సర్వేలో పంచాయతీ సెక్రటరీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## లకావత్ గిరిబాబుకి పరామర్శ



ప్రజాపక్షం/జూలూరుపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి, వైరా నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు తల్లి లకావత్ లక్ష్మి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సుజాతనగర్ మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి లావుడ్యా సత్యనారాయణ నాయక్ జూలూరుపాడు మండలంలోని రోడ్డు మాచినేనిపేట తండా గ్రామంలో పరామర్శించారు. ఈ సందర్భంగా లకావత్ లక్ష్మి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి, లకావత్ గిరిబాబుని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాల్వంచ మున్సిపల్ కార్మికులకు అల్పాహారం పంపిణీ




ప్రజాపక్షం/పాల్వంచ : లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామానికి చెందిన ఆకిరెడ్డి శ్రీనివాసరావు(రేగళ్ల శ్రీను) మాతృమూర్తి రాజమ్మ జ్ఞాపకార్థం సందర్భంగా మంగళవారం 187 మంది కి అల్పాహారం ఏర్పాటు చేయగా మున్సి పల్ కమిషనర్ సుజాత కార్మికులకు అల్పాహారం అందించారు. పాల్వంచ మండలం యానంబైలు గ్రామానికి చెందిన బుడగం నాగేశ్వరరావు అరటిపళ్లు అందిం చారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషన్ సుజాత మాట్లాడుతూ సేవా దృక్పథంతో ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమం ఎంతో పుణ్యమని ఇలాంటి సేవా దృక్పథం మరి కొంత మందికి ఆదర్శంగా నిలుస్తుందని ఈ కార్యక్రమము ఏర్పాటు చేసిన ఆకిరెడ్డి శ్రీనివాసరావును అభినందించారు. ఈకార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు, కనగాల అనంతరాములు, బుడగం నాగేశ్వరరావు, నల్లెల వాసు, పారిపత్తి వెంకటేశ్వర్లు, కోళ్ల మోహన్‌రావు, బోశెట్టి సాంబయ్య, కతోజు నాగేంద్ర, తాజుద్దీన్, లక్ష్మీదేవిపల్లి మాజీ ఉపసర్పంచ్ రాజశేఖర్, గాడేపల్లి వీరభద్రం, యడ్లపల్లి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

## కేంద్ర హోం మంత్రి పదవి నుండి అమిత్ షాను తొలగించాలి




ప్రజాపక్షం/ములకలపల్లి: కేంద్ర హోం మంత్రి పదవి నుండి అమిత్ షాను వెంటనే వైదొలగాలని సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని సిఐటియు ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ భారత పార్లమెంట్‌లో భారత నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ని అవమానించిన అమిత్ షా దేశానికి హో మంత్రిగా ఉండడానికి వీలు లేదని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ని అవమానించడం అంటే దేశ ప్రజల్ని కూడా అవమానించినట్లేనని అన్నారు. అమిత్ షా వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం బదులు మనువాదాన్ని బిజెపి, ఆర్ఎస్ఎస్ తీసుకొచ్చే ప్రయత్నాన్ని వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు గంటా శ్రీనివాసరావు, వరాక రుక్మధరావు, మేకల రమేష్, మారగాని గిరి, పొదిలి రాంబాబు, వెంకటేశ్వర్లు, కృష్ణ, పాల్గొన్నారు.

## మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాం-క్షలు



ప్రజాపక్షం/వైరా : ప్రతి ఒక్కరు నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలతో సుఖంగా ఉండి ఆర్థికంగా ఎదగాలని వైరా పట్టణ కాంగ్రేస్ నాయకులు ఫణితి సైదులు అన్నారు. ఈసందర్భంగా

## ఉద్యోగస్తుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



ప్రజాపక్షం/జూలూరుపాడు: పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో ప్రభుత్వం ఉద్యోగస్తుల సమస్యలు పట్టించుకోకుండా వ్యవహరించడం సరికాదని, ప్రభుత్వం సమ్మెను విరమింప చేసి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏఐవైఎఫ్ జూలూరుపాడు మండల కార్యదర్శి షేక్ చాంద్ పాషా ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, వారితో చర్చలు జరిపి వారి సమ్మెను విరమింపజేయాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంచార్జిలచే తాత్కాలిక బోధన, కేజీబీవీల పర్యవేక్షణల వల్ల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నరని, కేజీబీవీలపై అవగాహన లేని వారిని ఇంచార్జి లుగా నియమిస్తే విద్యార్థులు అన్ని విధాలుగా నష్టపోతారని ఆయన అన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని వెంటనే స్పందించి విద్యార్థులు రోడ్లు ఎక్కకుండా చూసుకోవాలన్నారు. అలాగే సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, వారిని రెగ్యులరైజ్ చేయాలని, వారిని విద్యా శాఖలో విలీనం చేసి, అన్ని బెనిఫిట్స్ అందేలా చూడాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదేనని, ప్రజాపాలనలో నూతన ప్రభు త్వం పై తిరుగుబాటు జరగకుండా చూసుకోవాలని హితవు పలికారు. విద్యార్థులు ఇబ్బందులు పడితే మాత్రం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె లో కలిసి పాల్గొని ఉద్యమాన్ని ఉధృతంచేస్తామని ఆయన హెచ్చరించారు.

## నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకోవాలి

**-మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు**
**-జూలూరుపాడు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ బాదావత్ రవి**



ప్రజాపక్షం/జూలూరుపాడు: నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరు ఆనందంగా జరుపుకోవాలని జూలూరుపాడు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ బాదావత్ రవి ఒక ప్రకటనలో కోరారు. ముందుగా ఆయన కొత్త సంవత్సరంలో ప్రజలందరికీ మంచి కలగాలని ఆశిస్తూ, మండల ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ నిబంధనలను అతి క్రమించరాదని, నూతన సంవత్సర వేడుకల్లో టపాసులు, మైక్‌లు ఎక్కువ సౌండ్ పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. డీజేలు నిషేధం అని, నిబంధనలు విరుద్ధంగా వినియోగిస్తే సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తాం అన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం అన్నారు. వాహనాలు ఇష్టానుసారంగా వేగంగా నడిపితే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ, ప్రవేట్ ఆస్తులపై రాళ్లు వేయడం, అద్దాలను పగలగొట్టడం, మహిళలను ఇబ్బంది పెట్టినా, అసభ్యంగా ప్రవర్తిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం అని అన్నారు. మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. న్యూ ఇయర్ వేడుకలలో నిషేధిత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం దుకాణాల్లో మైనర్లకు మద్యం అమ్మకూడదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారికి వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని, వారి వల్ల ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే వారి సంరక్షకుల పైన కేసులు నమోదు చేస్తాం అన్నారు. పై అంక్షలను ఎవరైన అతిక్రమించినా, ఉల్లంఘించినట్లుగా మీ దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 కు సమాచారం అందించడం ద్వారా తక్షణమే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని తెలిపారు. ఈ వేడుకలను ప్రజలు, యువత తమ ఇండ్లలోనే తమ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషకరమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ముక్కోటి భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



ప్రజాపక్షం/భద్రాచలం : ముక్కోటికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. మంగళవారం గోదావరి తీరంతో పాటు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో గ్రామపంచాయితీ ఇఓతో కలిసి ఆయన పర్యటించారు. భక్తులు భస చేసే ప్రదేశాల్లో నీటి సమస్య తలెత్తకుండా ఉండేలా చూడటంతో పాటు తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానాలు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి కరకట్టతీరంలో వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. గిరిజన కల్చర్‌కు సంబంధించిన వస్తువులు, ఆహారపదార్థాలు విక్రయించుకునే విధంగా చూడాలన్నారు. అనంతరం ఉత్తర ద్వార ప్రదేశాన్ని పరిశీలించారు. అధ్యనోత్సవాలకు సంబంధించిన అన్ని వివరాలను దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎల్ రమాదేవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్టాండ్ వెనుక భాగంలో ఉన్న అనాధశరణాలయం ముందు ఉన్న ఖాళీ ప్రదేశాన్ని పరిశీలించారు. ఖాళీ ప్రదేశంలో చుట్టు ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని డిఇ హరీష్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఇఇ వెంకటేశ్వర్లు, దేవస్థానం ఇఓ రవీంద్రరావు, డిఈ వెంకటేశ్వర్లు, జిపి ఇఓ శ్రీనివాసరావు, టిఏ శ్రీనివాస్‌పాల్గొన్నారు.

## మ్యూజియం అభివృద్ధికి కృషి చేయాలి



ప్రజాపక్షం/భద్రాచలం : ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు అందరికీ తెలిసే విధంగా రూపొందించిన గిరిజన మ్యూజయంను పర్యాటకులు సందర్శించేలా సిబ్బంది ప్రచారం నిర్వహించి అభివృద్ధికి కృషి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలానికి అనేక మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఐటిడిఏలో ఏర్పాటు చేసిన ఆదివాసీ మ్యూజియం సందర్శనను పురస్కరించుకుని వంటకాలు, ఇతర ఆహార పదార్థాలు తయారు చేసే యువతీ యువకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ ట్రైబల్ కల్చర్‌కు సంబంధించిన మ్యూజియం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నందున వచ్చే పర్యాటకులకు మంచి పౌష్టికాహారంతో పాటు పరిశుభ్రమైన ఆహార పదార్థాలు తయారు చేసి అందించాలన్నారు. వారితో మర్యాదపూర్వకంగా మెలగడంతో పాటు మన్ననలు పొందాలని తెలిపారు. తద్వారా మంచి ప్రచారం, గుర్తింపు లభిస్తుందన్నారు. ఇందుకోసం అంతా కలిసికట్టుగా సమన్వయంతో పనిచేసి మ్యూజియం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ డేవిడ్ రాజ్, జేడిఎం హరికృష్ణ, మణికుమారి, దినేష్, గిరిజన మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# టిఎస్ ఆర్టిసిలో శ్రమదోపిడీ

**- కార్మికులు, ప్రయాణికులకు పొంచి ఉన్న ప్రమాదం**
**- వాపోతున్న కార్మికులు**



ప్రజాపక్షం/భద్రాచలం : టిఎస్ ఆర్టిసి భద్రాచలం డిపోలో శ్రమదోపిడీ జరుగుతుందంటూ కొందరు కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు తమకు నచ్చినట్లుగా లాంగ్ డ్యూటీలను వేస్తూ కార్మికుల రెస్ట్ లేకుండా పనిచేయించేందుకు పూనుకున్నట్లు చెబుతున్నారు. నేటి నుండి ప్రతీ రోజు ఉదయం 10 గం.లకు భద్రాచలం నుండి బిహెచ్ఇల్ సర్వీసులను నడిపేందుకు డిపో మేనేజర్ సిద్ధమయ్యారు. కాగా 10 గం.లకు బయలు దేరే బస్సు రాత్రి 7.15 వరకు బిహెచ్ఇల్ చేరుకునేలా టూట్ టైమింగ్ తయారు చేశారు. కానీ అధికారులు నిర్ణయించిన సమయానికి గమ్యస్థానాన్ని చేరుకోవడం సాధ్యపడదని వా పోతున్నారు. సింగల్ డ్రైవర్ తో నడిచే ఈ సర్వీసులో ప్రయాణికులకు టిక్కెట్లు ఇచ్చుకుంటూ, రిజర్వేషన్ చెక్ చేసుకుంటూ, కార్గో సర్వీసులు చూసుకుంటూ పోవాలని, ఎంత వేగంగా వెళ్లినప్పటికీ అధిక శ్రమతో కూడి ఉంటుందని అంటున్నారు. మరో ప్రక్క ఎంజిబిఎస్ నుండి బిహెచ్ఇల్ వరకు సాయంత్రం వేళల్లో పెద్ద ఎత్తున ట్రాఫిక్ ఉంటుందని, అక్కడికి చేరుకోవాలంటే కనీసం 3 గం.లు పైనే పడుతుందని చెబుతున్నారు. అధికారులు నిర్ణయించిన సమయానికి అతివేగంగా వెళ్లాలన్నా కుదరదంటున్నారు. మరో ప్రక్క రెండు మస్టర్లుగానే దీనిని నడుపుతున్నారని, మూడు మస్టర్లు ఇస్తే ఒక రోజు సెలవు దొరుకుతుందని తద్వారా అలసట లేకుండా తిరిగి మళ్లీ విధులు నిర్వహించుకునేందుకు వీలుంటుందని చెబుతున్నారు. అమియాపూర్ డిపోకు చెందిన బస్సులు రెండు రోజుల మస్టర్‌తో ఇక్కడికి వస్తున్నాయనే ఉద్దేశ్యంతో ఇక్కడ కూడా అదే విధానాన్ని అమలు చేస్తున్నారని, కానీ మియాపూర్ డ్రైవర్లకు ఒక హార్డ్ డ్యూటీ ఆ తర్వాత ఒక లైట్ డ్యూటీ ఉంటుందని, కాని భద్రాచలం డిపోలో మాత్రమే అన్నీ హార్డ్ డ్యూటీలో ఉంటాయని చెప్పారు. అటు డ్రైవర్‌తో పాటు ప్రయణికులకు ప్రమాదం పొంచి ఉందని చెబుతున్నారు. ఈ బస్సు సర్వీసుకు విధించిన నిబంధనలను అధికారులు మరోసారి పరిశీలించి కార్మికులు ఇబ్బంది పడుకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**డిమాండ్ ఉంది : తిరుపతి, ఆర్‌టిసి డిఎం...**

భద్రాచలం నుండి బిహెచ్ఇఎల్, మియాపూర్, కుకట్ పల్లి సర్వీసులకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉందని, సంక్రాతి కావడంతో అధికంగా ప్రయాణికులు ఎక్కే అవకాశం ఉండటంతో బిహెచ్ఇఎల్ సర్వీసును నేటి నుండి ప్రతి రోజు ఉదయం కూడ నడుపుతున్నట్లు డిఎం తిరుపతి చెప్పారు. మియా పూర్ నుండి భద్రాచలంకు ఐదు సర్వీసుల నడుస్తున్నాయని, వారు కూడా ఐదు సర్వీసులకు కేవలం రెండు రోజుల మస్టర్ ఆత్రమే ఇస్తున్నారని, ఇక్కడి డిపోలో మాత్రం ఒక రోజు రెండు రోజుల మస్టర్, మరొకసారి మూడు రోజుల మస్టర్ ఇచ్చేందుకు నిర్ణయించామని, పనిభారం అంటూ కార్మికులు చెబుతున్న దానిలో నిజం లేదని వివరణ ఇచ్చారు. సంస్థకు నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత తనపై, కార్మికులపై కూడా ఉందని, అదే విధంగా కార్మికుల శ్రేయస్సు కోసం ఎల్లవేళలా కృషి చేస్తామని చెప్పారు.

# తవ్వారు.. నిర్లక్ష్యంగా వదిలారు...





ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు లోని ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ప్రవేశ ద్వారం వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మత్తుల కోసం 20 రోజుల క్రితం తవ్వి వదిలారు. ఆర్డిఓ కార్యాలయానికి ఏన్కూరు, తల్లాడ, పెనుబల్లి, కల్లూరు, సత్తుపల్లి, వేంసూరు మండలాలకు చెందిన ప్రజలు అవసరాలు నిమిత్తం ఆర్డీవో కార్యాలయంకు వస్తూపోతూ ఉంటారు. మరియు అదేవిధంగా కార్యాలయం ఎదురుగా 5వ తరగతి లోపు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు మరియు అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఈ రహదారిలో చిన్న పిల్లలు ఉదయం పాఠశాలకు కేంద్రాలకు వచ్చి నాలుగు గంటల సమయంలో ఇండ్లకు వెళ్తూ ఉంటారు. ఈ సమయంలో పిల్లలు విద్యార్థులు మరియు ఆరు మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలుజారితే ప్రమాదం జరుగుతుందని పెద్దలు, పిల్లలు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కార్యాలయం వద్ద మిషన్ భగీరథ పైప్లైన్ మరమ్మత్తుల కోసం 20 రోజులైనా కూడా మరమ్మతులు చేయలేకపోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. వెనుకకు తిరిగి వెళ్లాల్సివస్తుంది. ఈ విషయమై ఆర్డిఓ రాజేంద్ర మిషన్ భగీరథ శాఖ వారికి ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

## కొత్త సంవత్సరంలో కొత్త వెలుగులు నింపాలి



ప్రజాపక్షం/వైరా : నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అన్నారు. ప్రజలందరు పాడి పంటలు , సుఖసంతోషాలతో వర్థిల్లాలని పేర్కొన్నారు. గత సంవత్సరం మంచి చెడులను దృష్టిలో పెట్టుకొని ఈ సంవత్సరం ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. 2025 సంవత్సరంలో ప్రజలందరికి మచి జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## రైతు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



ప్రజాపక్షం/పాల్వంచ టౌన్: రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. అశ్వాపురం మండల పరిధిలోని మిట్టగూడెంలో డిసిఎంఎస్ ద్వారా ఏర్పాటైన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం కొత్వాల సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన ప్రతి రైతుకు ప్రభుత్వం మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయలు ప్రభుత్వ బోనస్ కూడా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. రైతుల సంక్షేమానికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. రైతు శ్రేయస్సే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని అన్నారు. ఒకే దఫా 2లక్షల రూపాయల రుణమాఫీ చేసిందని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసిందన్నారు. రైతులకు ధాన్యం క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ ఇస్తున్నదని, త్వరలోనే రైతు భరోసా పథకం చేపట్టనున్నదని అన్నారు. ఈకార్యక్రమంలో కేంద్రం ఇంచార్జి, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమిలీ పాఠశాలలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురంలోని ఎమిలీ పబ్లిక్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ములకలపల్లి గోపీనాథ్ మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో విద్యార్థులైన మీరు మీ తల్లిదండ్రులు మీ కుటుంబాలు ఆనందంతో సంతోషంతో ఉండాలని ప్రతి ఒక్క కుటుంబం అష్ట ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ప్రతి ఒక్కరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయురాల బృందంకూడా విద్యార్థులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయురాల బృందం కూడా విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా వాహన తనిఖీలు



ప్రజాపక్షం/అశ్వాపురం: మండలంలోని మొండికుంటలో సిఐ అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ తిరుపతిరావు తన సిబ్బందితో వాహన తనిఖీలు చేస్తూ రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపూ వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మున్నూరు కాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/అశ్వాపురం: మొండికుంట మున్నూరు కాపు సంఘంమండల అధ్యక్షులు కమటం వెంకటేశ్వరరావు ఇంటి వద్ద మంగళవారం డిసిఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మండలం మున్నూరు కాపు సంఘం క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో కొత్వాల మాట్లాడుతూ అన్ని రంగాల్లో మున్నూరు కాపులు రాణించాలని, రాబోయే రోజుల్లో మరెన్నో సేవ కార్యక్రమాలు చేస్తూ ఐక్యమత్యంతో ముందు కెళ్లాలని పేర్కొన్నారు. సంఘం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కమటం వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు అసా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కాసర బాధ రాములు, కోలా నాగేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి ఎర్రంశెట్టి ముత్తయ్య, పులి సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు, కమటం సురేష్, ఆవుల రవి, నల్లపాటి సత్యనారాయణ, యువజన సంఘం అధ్యక్షులు పర్వత నరేష్, మండల కార్యవర్గ సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు, యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు : రేగా



ప్రజాపక్షం/బూర్గంపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలను మాజీ రాష్ట్ర ప్రభుత్వ విప్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు తెలిపారు. మంగళవారం ఆయన ప్రజాపక్షంతో మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రజలు అందరు మా ఆదివాసీల ఆరాధ్య దైవం సమ్మక్కసారలమ్మ ఆశీర్వాదంతో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో మన జిల్లా, రాష్ట్రం అంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

## న్యూ ఇయర్ వేడుకలకు ముస్తాబు



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు లోని నూతన సంవత్సర వేడుకలకు హోటళ్ళు, స్వీట్ దుకాణాలు, కిరాణా దుకాణాలు, కేక్‌లు, మిఠాయిలు, బిర్యానిలు ఆర్డర్లతో హడావుడి జరుగుతుంది. దుకాణాలతో కొనుగోలు దారులతో సందడి నెలకొంది. అదేవిధంగా పూల దుకాణాలు కూడా బొకేలతో డిమాండ్ పెరిగింది. నూతన సంవత్సరం సందర్భంగా కుటుంబాలు స్నేహితులు ఆత్మీయలతో ఎంతో వేడుకగా జరుపుకోవాలని ఉల్లాసంగా, ఉత్సాహంగా సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు రకాల దుకాణాలన్నీ హడావుడి కొనుగోలుదారులతో సందడి నెలకొంది. ఇదే అదునుగా అన్నిటికి ధరలు పెంచేశారు. క్రైస్తవ, హిందూ, ముస్లిం తదితర దేవాలయాలన్నీ ప్రార్థనలకు ముస్తాబయ్యాయి. ఈ సందర్భంగా నూతన సంవత్సర వేడుకలు ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సాహంగా జరుపుకోవాలని పోలీస్‌లు తెలిపారు.

# అమరావతి తరహాలో బౌద్ధక్షేత్రం అభివృద్ధికి చర్యలు

## -పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఫణిగిరి నుంచి నాగార్జున సాగర్ వరకు బుద్దిస్ట్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ చేపడుతుందని పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రంను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్‌రెడ్డితో పాటు పురావస్తు టూరిజం అధికారులు మంగళవారం బౌద్ధ క్షేత్రంను సందర్శించారు. పర్యాటకులను ఆకర్షించేలా తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. మ్యూజియం ఇతరత్రా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా డిడి రాములు నాయక్ మాట్లాడుతూ బౌద్ధక్షేత్రంను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రూ. 2.50 కోట్లతో మ్యూజియం, త్రాగునీరు, ఎల్ఈడి లైట్లు, మరుగుదొడ్లు, గ్రీనరీ ఏర్పాట్లపై చర్చించినట్లు తెలిపారు. ఫణిగిరి, గాజులబండ, చాడ, నేలకొండపల్లి నుంచి కారుకొండ మీదుగా నాగార్జున సాగర్ వరకు అన్నింటికి కనెక్టివిటి చేసేందుకు యాక్షన్ ప్లాన్ చేపడుతున్నట్లు తెలిపారు. ఇటీవల ఫణిగిరి పక్కన గాజులబండలో కూడ బౌద్ధస్తూపం ఉన్నట్లు తెలిపారు. చాడ అనే గ్రామంలో బుద్దిస్ట్‌కి ఫేమస్ అన్నారు. ఈ మధ్యనే అక్కడ తవ్వకాలు కూడా చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడి బౌద్ధక్షేత్రంను అమరావతి తరహాలో అభివృద్ధి చేయాలని యాక్షన్ ప్లాన్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తుంబూరు దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పర్యాటక హాబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బౌద్ధ క్షేత్రం వద్ద అన్ని సౌకర్యాలు కల్పించి బుద్దిస్టులు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటకులకు అనుగుణంగా అభివృద్ధి చేసే విషయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పురావస్తు శాఖ అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్, ఇంజనీర్ నర్సింహారావు, పర్యాటక శాఖ ఎస్‌ఈ సరిత, జిల్లా అధికారి సుమన్ చక్రవర్తి, డిఈ రామకృష్ణ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, నాగేశ్వరరావు, నవీన్, బొందయ్య, వి. నాగేశ్వరరావు, బి.నాగరాజు, సత్యనారాయణ, లక్ష్మి నర్సయ్య, నరేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సాయి ఎక్సలెంట్ స్కూల్లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రమైన జూలూరుపాడులో గల సాయి ఎక్సలెంట్ స్కూల్లో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ హుస్సేన్ మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో అందరు సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని, విద్యార్థులు మంచిగా చదివి, పరీక్షలు బాగా రాసి ఉన్నత శ్రేణి ఫలితాలు సాధించి, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకనుగుణంగా ముందుకు సాగాలని కోరారు. గత సంవత్సరంలో వచ్చిన నవోదయ సీట్ల కంటే ఈ నూతన సంవత్సరంలో నవోదయ సీట్లు, గురుకుల సీట్లు, ఏకలవ్య అత్యధిక సీట్లు సాధించి, జిల్లా, మండల స్థాయిలో స్కూల్ పేరును ఇనుమడింపజేయాలని కోరారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. విద్యార్థినీ విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు డైరెక్టర్ శివ




కుమరీ బి. సరిత, సుజాత, వీరభద్రం, అనిత నబీన, దుర్గా భవాని, సాహితి, పద్మ సత్యావతి, నాగలక్ష్మి , సరిత భాను, అఖిల, రజిత, అరుణ, రేష్మ, నందిని, ప్రశాంతి, రాంకుమార్, మృదుల్, రాంబాబు, శాంతమ్మ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వేర్వేరు సంఘటనల్లో రోడ్డు ప్రమాదాలు

## ముగ్గురికి గాయాలు

**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలంలో వేరువేరు ప్రదేశాల్లో జరిగిన మూడు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులకు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా ఒక వ్యక్తి స్వల్ప గాయాలయ్యాయి. రెండు బైక్లు ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఒకరికి స్వల్ప గాయాలు అయ్యాయి. లారీ సైకిల్ పై వెళుతున్న వ్యక్తిని ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. టిప్పర్ లారీ ట్రాక్టర్ ఢీ కొట్టిన ఘటనలో ఒక వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మంగళవారం సాయంత్రం పొలం కూలి పనులు చేసుకుని సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తున్న టేకులపల్లి గ్రామానికి చెందిన నల్లబోతుల శీనుని టేకులపల్లి గ్రామంలో జాతీయ రహదారిపై ఖమ్మం వైపు వెళుతున్న లారీ ఎదురుగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గంగదేవిపాడు గ్రామానికి చెందిన బత్తిన వెంకటేశ్వర్లు, జడల శ్రీను పెనుబల్లి నుండి గంగదేవిపాడు గ్రామానికి బైక్ పై వెళుతుండగా తాళ్లపెంట గ్రామానికి చెందిన మీడియం అశోక్ తాళ్లపెంట నుండి వీయం.బంజర్ వస్తుండగా గంగదేవిపాడు రోడ్డులో ఎదురుగా రెండు బైకులు ఢీకొనడంతో మీడియం అశోక్‌కి, జడల కిరణ్ కి తీవ్ర గాయాలు కాగా బత్తిన వెంకటేశ్వర్లుకి స్వల్ప గాయాలు అయ్యాయి. బయ్యనగూడెం గ్రామం వద్ద రోడ్డుపై పడిపోయిన ధాన్యం బస్తాలను ట్రాక్టర్ పై లోడ్ చేస్తుండగా తిరువూరు వైపు వెళుతున్న టిప్పర్ ఢీకొట్టడంతో కుప్పెనకుంట్ల గ్రామానికి చెందిన వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. టేకులపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని 108 అంబులెన్స్ లో, గంగదేవి పాడు రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయబడిన వారిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన మీడియం అశోక్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# టిఎస్‌యుటిఎఫ్ క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల వనరుల కేంద్రంలో టిఎస్‌యూటిఎఫ్ ఎర్రుపాలెం మండలశాఖ ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను మండల విద్యాశాఖాధికారి బి.మురళీమోహన్ ఆవిష్కరించారు. టిఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగులుందరికీ నూతన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు, నంద్రు వెంకటేశ్వరరావు, కోశాధికారి నీలం సైదా రావు, రావిరాల భరత్, ఎం.శ్రీనివాస్, పుల్లారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సివిల్ సప్లయి హమాలీల సమ్మె నోటీస్ అందజేత

**ప్రజాపక్షం/ మధిర :** సివిల్ సప్లయి హమాలీలు, జెసిసి హమాలీల ఎగుమతి, దిగుమతి రేట్లు ఒప్పందం ప్రకారం జీవో విడుదల చేసి పెరిగిన రేట్లకనుగుణంగా ఏరియర్స్ చెల్లించాలని మంగళవారం సివిల్ సప్లయి కార్మికులు సమ్మె నోటీస్ అధికారులకు అందించారు. పౌర సరఫరాల సంస్థ, జెసిసి హమాలీల పెంచిన వేతనాన్ని వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో జనవరి 1వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయి హమాలీలందరూ సమ్మె చేయటం జరుగుతుందని సిఐటియు మండల కన్వీనర్ పడకంటి మురళీ తెలిపారు. ఈ కార్యక్రమంలో హమాలీ మేస్త్రీ నాగమల్లేశ్వరరావు, చింతల నాగరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యోగులకు పదవీ విరమణ సహజం



**ప్రజాపక్షం/సుజాతనగర్:** ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. మంగళవారం పాల్వంచలోని టీఎస్ జెన్కో ఐదు, ఆరు దశలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సుజాతనగర్ మండలంలోని నాయకులగూడెం గ్రామానికి చెందిన కుమారి నాగేశ్వరరావు దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. పలువురిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జెన్కో అధికారులు, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

# ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/సుజాతనగర్:** ప్రజా పక్షం పత్రిక ప్రజల గొంతుకు గా పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని సుజాతనగర్ ఎస్ఐ మాలోత్ రమాదేవి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ప్రజాపక్షం రిపోర్టర్ మేకల వెంకటేష్ పోలీస్ సిబ్బందితో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ప్రజా పక్షం పత్రిక పనిచేస్తుందని తెలిపారు. అతి తక్కువ కాలంలోనే ప్రజాదారణ పొంది ప్రజా సమస్యలను వెలికితీయడంలో ముందుండటం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, కానిస్టేబుల్స్ డి. రమేష్, మోహన్, నరసింహారావు సిబ్బంది పాల్గొన్నారు.

# కొణిజర్ల మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

## -కొణిజర్ల మాజీ ఎంపిపి గోసు మధు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** కొణిజర్ల మండల ప్రజలకు 2024 సంవత్సరానికి వీడ్కోలు చెపుతు ఈసంవత్సరంలో జరిగిన మంచి చెడులను దృష్టిలో పెట్టుకొని 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతు ఈ సంవత్సరంలో ప్రజలందరికి మంచి జరగాలని కోరుకుంటున్నానని కొణిజర్ల మాజీ ఎంపిపి గోసు మధు తెలిపారు. నా పదవీ కాలంలో నాకు అన్ని విధాల సహకరించిన ప్రజలకు , అధికారులకు , జర్నలిస్టు మిత్రులకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలని కాంగ్రేస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆదేవుని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

## మార్క్‌ఫైడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్



**ప్రజాపక్షం/వైరా :** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, కార్మికులకు, కర్షకులకు, స్వచ్ఛంద సేవా నిర్వాహకులకు, విద్యార్థిని విద్యార్థులకు, జర్నలిస్టు మిత్రులకు ప్రతిఒక్కరికి నూతన సంవత్సర భుభాకాంక్షలు తెలుపుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫైడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్ అన్నారు. ఈసందర్భంగా బొర్రా రాజశేఖర్ మాట్లాడుతు 2025 సంవత్సరంలో ప్రతిఒక్కరి కుటుంబాల్లో నూతన ఉత్తేజాన్ని నింపి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పడాలని ఆయన అన్నారు. మరోసారి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు బొర్రా రాజశేఖర్ తెలిపారు.

# మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

## తెలంగాణ పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు



**ప్రజాపక్షం/వైరా :** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, మీడియా మిత్రులకు ప్రతి ఒక్కరికి 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు తెలంగాణ పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు తెలిపారు. 2024 సంవత్సరంలో జరిగిన మంచి చెడులను దృష్టిలో ఉంచుకొని గత సంవత్సర జ్ఞాపకాలకు వీడ్కోలు చెబుతు 2025 నూతన సంవత్సరంలో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని ఆ దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రేస్ పరిపాలనలో ప్రజలందరికి మంచి జరగాలని ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికి అందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# శ్రీ ఆదర్శలో నూతన సంవత్సర వేడుకలు



**ప్రజాపక్షం/ చింతకాని :** మండల పరిధిలోని నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులు రంగవల్లులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.